సాక్షి అనకాపల్లి

శనివారం । 9 । నవంబర్ । 2024



క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

నక్కపల్లిలో అండర్-14 బాల బాలికల రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు ప్రారంభమయ్యాయి. 500 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. 8లో



క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్: విశాఖ కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల వరకు నమోదవుతాయని, గాలి గంటకు 3 నుంచి 7 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు సౌకర్యం

- కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం డ్వామా, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా, రోడ్లు భవనాలు, నీటిపారుదల శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులకు వచ్చే సమావేశానికి పూర్తి చేయాల్సిన లక్ష్యాలను నిర్దేశించవలసినదిగా జిల్లా అధికారులను ఆమె ఆదేశించారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను నవంబరు 15 నాటికి నూరు శాతం ప్రారంభించాలని, 31 నాటికి 75 శాతం పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలో 74 గుంతలు పూడ్చడానికి రూ.534 లక్షలు మంజూరయ్యాయని, ఆ పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. జనవరి నాటికి జిల్లాలో 6,067 గృహాలు పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించారని, ఇప్పటివరకు 1,692 గృహాలు మాత్రమే పూర్తయ్యాయన్నారు. నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల సిబ్బందికి శిక్షణ అందించాలని, రెవిన్యూ అధికారులతో సమన్వయంగా పనిచేయాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు.

పశుగణనకు 298 మంది ఎన్యూమరేటర్లు

మాకవరపాలెం: జిల్లాలో పశుగణనకు 298 మంది ఎన్యూమరేటర్లను నియమించినట్టు పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి బి.రామ్మోహన్‌రావు తెలిపారు. మండలంలోని తామరం, మాకవరపాలెంలో జరుగుతున్న ఇంటింటి పశుగణనను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం తామరం పశువైద్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 67 పశువైద్య కేంద్రాల పరిధిలో ఈ నెల 1న పశుగణనను ప్రారంభించామన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ గణనకు 298 మంది ఎన్యూమరేటర్లను, 59 మంది సూపర్‌వైజర్లను నియమించామన్నారు. 67 పశువైద్య కేంద్రాల్లో మాకవరపాలెం, బూరుగుపాలెం, నాతవరం, శృంగవరం, తట్టబంద, చోద్యం, వేములపూడి కేంద్రాలు వైద్యులు లేక ఇన్‌చార్జ్‌లతోనే కొనసాగుతున్నాయన్నారు. కొత్త పోస్టులు తీస్తే తప్ప ఖాళీలు భర్తీ అయ్యే అవకాశం లేదన్నారు. ఆయన వెంట మాకవరపాలెం ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి ప్రతాప్, సిబ్బంది ఉన్నారు.

రైలు ఎక్కుతూ జారిపడ్డ ప్రయాణికుడు

- బోగీ ఫుట్‌బోర్డు, ప్లాట్‌ఫారం మధ్యలో చిక్కుకొని తీవ్ర గాయాలు



క్షతగాత్రుడు పైలా రాజబాబు

అనకాపల్లి: స్థానిక రైల్వే స్టేషన్ మూడో నంబర్ ప్లాట్‌ఫారంపై ఉన్న సికింద్రాబాద్-విశాఖ జన్మభూమి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతూ జారిపడ్డ యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. రావికమతం మండలం తోటకూరపాలెం గ్రామానికి చెందిన పైలా రాజబాబు (39) ప్లాట్‌ఫారానికి, రైలు బోగీ ఫుట్‌బోర్డుకు మధ్యలో జారిపోయాడు. అరగంటసేపు రైలు నిలిపి, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ నవీన్, తమ సిబ్బంది, స్థానిక ప్రయాణికుల సహాయంతో ప్లాట్‌ఫారంపై పలకలను తొలగించి, 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వలలో చిక్కుకున్న కొండచిలువ

- రక్షించిన అటవీ అధికారులు



యలమంచిలి రూరల్: యలమంచిలి నుంచి తుని వైపు వెళ్లే పాత జాతీయ రహదారి పక్కన తాగునీటి సంపుకెదురుగా ఉన్న పంటకాల్వలో శుక్రవారం చేపల కోసం కట్టిన వలలో కొండచిలువ చిక్కుకుంది. దీనిని గమనించిన కొందరు స్థానిక అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. యలమంచిలి అటవీ సెక్షన్ అధికారి బీవీ రమణ, ఏబీవో ఆర్ గోవింద్ అక్కడకు చేరుకుని వలలో చిక్కుకున్న కొండచిలువను అతి కష్టం మీద కాల్వలోంచి బయటకు తీశారు. సుమారుగా ఎనిమిది అడుగుల పొడవు ఉన్న కొండచిలువను తర్వాత వేమగిరి రిజర్వు ఫారెస్ట్‌లో విడిచి పెట్టారు. నీటి పారుదల శాఖకు చెందిన పంట కాల్వల్లో కొందరు అక్రమంగా వలలు ఏర్పాటు చేసుకుని చేపల వేట కొనసాగిస్తున్నారు. దీంతో కొన్ని వన్యప్రాణులకు ఈ వలలు ప్రాణ సంకటంగా మారుతున్నాయని అటవీ అధికారులు భవిస్తున్నారు.

కార్తీక పౌర్ణమి వేళ.. ఫణిగిరి ప్రదక్షిణం

పంచదార్ల.. రాష్ట్రంలోని ప్రసిద్ధ శైవక్షేత్రాలలో ఎంతో విశిష్టమైనది. సహజసిద్ధంగా ఏర్పడిన ఐదు ధారలు ఇక్కడ నిరంతరం ప్రవహిస్తుంటాయి. ఆ పవిత్ర శుద్ధ జలాలతో స్నానమాచరించి, ఫణిగిరిపై ఉన్న ఉమాధర్మలింగేశ్వరుడిని పూజించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. అంతటి మహిమ గల పర్వతం చుట్టూ ప్రదక్షిణ చేస్తే.. అదెంతో మహోన్నతం. కార్తీక పౌర్ణమి పుణ్యదినాన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించాలని ఆలయ కమిటీ తలపెట్టింది. తొలిసారిగా చేపట్టిన గిరి ప్రదక్షిణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తోంది.



రాధామాధవ స్వామి ఆలయం వద్ద పుణ్యధారల్లో స్నానమాచరిస్తున్న భక్తులు



ఉమాధర్మలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం

- పంచదార్ల పుణ్యక్షేత్రంలో తొలిసారిగా నిర్వహణ
- ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి తరలిరానున్న భక్త జనం
- విస్తృత ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రాంబిల్లి (యలమంచిలి): కార్తీక మాసం వచ్చిందంటే చాలు భక్తులందరి దృష్టి పంచదార్లపైనే ఉంటుంది. ధారపాలెంలో ఉన్న ఆ ప్రసిద్ధ శైవ క్షేత్రాన్ని దర్శించి, పంచధారలతో పుణ్యస్నానం చేసి, ఫణిగిరిపై వెలసిన ఉమాధర్మలింగేశ్వరుడిని దర్శించుకోవాలని అందరూ తపిస్తారు. ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి భక్తులు ఇక్కడకు వస్తారు. అయితే ఈ ఏడాది కార్తీకానికి ఒక ప్రత్యేకత ఉంది. ఈ నెల 15న పరమ పవిత్రమైన కార్తీక పౌర్ణమి రోజున ఫణిగిరి చుట్టూ ప్రదక్షిణ చేస్తే బాగుంటుందన్నది ఆలయ కమిటీ సంకల్పం. ఇందుకు భక్త బృందం కూడా ఉత్సాహం చూపడంతో చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయం అందరికీ తెలిసేలా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఫణిగిరి చుట్టూ 24 కిలోమీటర్ల దూరం ఉంటుంది. నడక సాగించే భక్తులకు ఈ మార్గంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.




పంచదార్ల క్షేత్రంలో కొండపై కొలువైన ఉమాధర్మలింగేశ్వరస్వామి

గిరి ప్రదక్షిణలో పాటించవలసిన నియమాలు

గిరి ప్రదక్షిణ చేసేటప్పుడు భక్తులందరూ రాగి పాత్రలో గానీ మట్టి పాత్రలో గానీ పుణ్య ధారలను తీసుకొని అందులో తులసి పత్రం గాని, మారేడు పత్రం గాని వేయాలి. ఆ పాత్రతో గిరి ప్రదక్షిణ చెయ్యాలి. ప్రదక్షిణ పూర్తయిన తరువాత ఈ ఆలయ ప్రాంతంలో ఉన్న ఏ శివలింగం మీదనైనా ఆ నీటిని అభిషేకించి తీర్థం స్వీకరించాలి. భక్తులు గిరి ప్రదక్షిణ మొదలు పెట్టే ముందు తమ మనసులో ఉన్న కోరికను బలంగా తలచుకొని ప్రారంభించాలి. తమ కోరిక తీరితే వచ్చే సంవత్సరం ఇంకో పదిమందిని గిరి ప్రదక్షిణకు తీసుకురావాలని ఆలయ పండితులు తెలిపారు. ఇంత మహిమ కలిగిన ఈ క్షేత్రం గురించి రాష్ట్రం నలుమూలల తెలియపరిచి ఇటువంటి పురాతన హిందు ధార్మిక క్షేత్రాలను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉమాధర్మలింగేశ్వరుని ఆలయ విశిష్టత

పంచదార్ల పుణ్యక్షేత్రం ఎంతో మహిమాన్వితమైనదని భక్తుల నమ్మకం. ఇక్కడి క్షేత్రపాలకుడైన శ్రీరాధామాధవ స్వామి ఆలయం వద్ద కొండ మీద పాండవులు వనవాస సమయంలో కొంత కాలం ఉన్నారని ప్రతీతి. ఇక్కడ ధర్మరాజు శివలింగాన్ని ప్రతిష్ఠించారని చెబుతారు. 11 కి.మీ. ఏకరూప పర్వతం అయిన ఫణిగిరి అంతర్భాగం నుంచి ఎన్నో ఔషధ గుణాలతో కూడిన జలధారలు కొండ దిగువన ఉన్న **రాధామాధవస్వామి ఆలయం వద్ద ఉన్న పంచధారల గుండా కొన్ని వేల సంవత్సరాలుగా ప్రవహిస్తూ వస్తున్నాయి. ఈ జలధారలో నీటిని స్వామివారి అభి**షేకానికి ప్రతిరోజు ఉపయోగిస్తారు. ఈ ప్రాంతం చుట్టూ ఉన్న 30 గ్రామాల ప్రజలు నిత్యం ఈ పంచధారలనే తాగునీటిగా వినియోగిస్తారు. ఈ క్షేత్రంలో స్వయంగా గంగాదేవి పరమేశ్వరుడి చెంతన వెలసిందని ఈ ప్రాంత ప్రజల విశ్వాసం. ఈ నీటితో స్నాన**మాచరిస్తే, సేవిస్తే అంటువ్యాధులు, చర్మవ్యాధులు, కీళ్ల నొప్పులు రావని నమ్ముతారు. ఈ జలధారలు కొండ మీద ఎక్కడ నుంచి వస్తున్నాయో ఎవరికీ తెలియదు. ఈ పర్వతం ప్రాంతంలో 100 నుంచి 200** వందల అడుగులు తవ్వినా ఎక్కడా నీటి జాడలు కనిపించవు. అలాంటిది వేసవిలోను, విపత్తుల సమయంలోనూ కూడా ఇక్కడ పుణ్యధారలు నిత్యం ప్రవహిస్తూనే ఉంటాయి. ఎంతో మహిమ కలిగిన ఈ పుణ్యక్షేత్రం విశిష్టత గురించి రాష్ట్రం నలుమూలల తెలిసేలా ఈ సంవత్సరం ఇక్కడ గిరి ప్రదక్షిణ ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ వర్గాలు తెలుపుతున్నాయి.



గిరి ప్రదక్షిణ సాగేది ఇలా..

పంచదార్ల పుణ్యక్షేత్రం నుంచి ఫణిగిరి పర్వతం చుట్టూ 24 కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ చేయాల్సి ఉంటుంది. ధారపాలెం, ధారభోగాపురం, వెంకటాపురం జంక్షన్, గొర్లె ధర్మవరం, వెదురువాడ, అచ్యుతాపురం, చోడపల్లి, కొండకర్ల, యర్రవరం, ఉప్పవరం, మల్లవరం, నరేంద్రపురం, చెర్లోపాలెం, మడకపాలెం, మూలజంప, గోకివాడ, కొత్తూరు, పంచదార్ల గ్రామాల మీదుగా ప్రదక్షిణ సాగుతుంది.

భవిష్యత్ తరాలకు తెలియాలని..



ఫణిగిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాలో ఉన్న ఈ పురాతన శివాలయం గురించి భవిష్యత్ తరాలకు తెలియాలని కార్తీక పౌర్ణమి రోజున ఈ కార్యక్రమాన్ని తలపెట్టాం. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాము. ఈ ఏడాది మొదటిసారిగా స్వామివారి గిరి ప్రదక్షిణ మహోత్సవాన్ని నిర్వహించడానికి పెద్దలు నిశ్చయించారు.

–సుందరపు లోవరాజు, ఉమాధర్మలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్

ఫైలు కదలాలంటే... చేయి తడపాల్సిందే

- మాకవరపాలెం తహసీల్దార్ కార్యాలయంలో పనికో రేటు
- రూ.15వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వీఆర్వో
- ఏసీబీ దాడులతో ఉలిక్కిపడిన సిబ్బంది



మాకవరపాలెం:

పని ఏదైనా చేయి తడపాల్సిందే... లేకుంటే కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయక తప్పదు. కొన్ని పనులకు బ్రోకర్లే రేట్లు నిర్ణయిస్తుండగా..మరి కొన్ని పనులకు సిబ్బందే దరఖాస్తుదారులతో బేరసారాలు సాగిస్తున్నారు. దీంతో మాకవరపాలెం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాలంటేనే స్థానికులు వెనుకడుగు వేస్తున్నారు. భూమి మ్యుటేషన్ చేసేందుకు లంచం తీసుకుంటూ తామరం వీఆర్వో పరవాడ లక్ష్మణరావు ఏసీబీ అధికారులకు శుక్రవారం పట్టుబడడంతో ఆరోపణలకు మరింత బలం చేకూరుతోంది. భీమబోయినపాలెం రెవెన్యూ పరిధిలో 7.15 ఎకరాల భూమిని కుటుంబీకుల పేరున మ్యుటేషన్ చేసేందుకు రొంగల చిన్నయ్యనాయుడు అనే రైతు దరఖాస్తు చేశాడు. భీమబోయినపాలెం రెవెన్యూకు మూడు రోజుల క్రితం వరకు లక్ష్మణరావు ఇన్‌చార్జ్ వీఆర్వోగా పనిచేశాడు. కాగా రెండు రోజుల కిందట ఆ రెవెన్యూకు కొత్తగా వీఆర్వోను నియమించారు. అయితే అంతముందే దరఖాస్తు చేయడంతో మ్యుటేషన్ చేసేందుకుగాను లక్ష్మణరావు రూ.15 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఈ రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో లక్ష్మణరావు లంచం సొమ్మును రైతు నుంచి తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీలు రమ్య, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఈ నగదును తీసుకున్న మరో వ్యక్తి తాడి కిరణ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నట్టు డీఎస్పీ రమ్య విలేకరులకు తెలిపారు. ఏసీబీ దాడులతో సిబ్బంది ఉలిక్కిపడ్డారు.

గతంలో ఏసీబీకి చిక్కిన సిబ్బంది..

మండలంలో గత 14 ఏళ్ల కాలంలో ఇక్కడ కార్యాలయంలో ఆర్‌ఐగా పని చేసిన విశ్వనాథం, సర్వేయర్ పైడిరాజు, వీఆర్వోలు అలప్పలనాయుడు, చంద్రశేఖర్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు చిక్కారు. దరఖాస్తుదారుల నుంచి లంచం డిమాండ్ చేయడం, ఇసుక రవాణా, తదితర వాటిలో అవినీతి ఆరోపణలతో కొందరు వీఆర్వోలు సస్పెండ్ కావడంతోపాటు మరి కొందరు ఆర్‌ఐలపై బదిలీ వేటు పడింది. 2018 నవంబర్‌లో బాణసంచా దుకాణానికి అనుమతి ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన విషయంలో ఆర్‌ఐ, సీనియర్ అసిస్టెంట్ సస్పెండ్ అయ్యారు. ప్రస్తుతం ఉన్న కొందరు రెవెన్యూ సిబ్బందిపైనా ఆరోపణలు ఉన్నాయి. మాకవరపాలెం రెవెన్యూ కార్యాలయం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ కార్యాలయంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఒక వైపు బ్రోకర్లు... మరో వైపు సిబ్బంది

చేయితడిపితేనే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు సిబ్బంది, మరోవైపు బ్రోకర్లు దరఖాస్తుదారులను పీడిస్తున్నారు. మండలంలో 25 రెవెన్యూగ్రామాలుండగా జనన,మరణ,కుటుంబ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకోసం కంటే భూము లఆన్‌లైన్, పట్టాదార్ పాసుపుస్తకాల కోసం అధికంగా దరఖాస్తులు వస్తుంటాయి. దీంతో రెవెన్యూ సిబ్బందితోపాటు బ్రోకర్లకు కాసుల పంట పండుతోంది.

ఎకరానికి రూ.10 వేల పైమాటే..

భూముల ఆన్‌లైన్ చేసేందుకు ఎకరానికి రూ.10 వేల పైనే లంచంగా సమర్పించుకోవలసి వస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో రూ.30 వేల వరకూ వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. సచివాలయం లేదా మీ సేవలో దరఖాస్తులు చేసిన దగ్గర నుంచి ఆన్‌లైన్ జరిగి పాస్‌పుస్తం చేతికందే వరకు నగదు ఇవ్వక తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనన, మరణ, ఫ్యామిలీ(వారసత్వ)ధ్రువీకరణ పత్రాల కోసం కూడా ఎంతోకొంత ముట్టజెప్పక తప్పడం లేదంటున్నారు. పై పనులకు అధికారుల కంటే బ్రోకర్లను సంప్రదిస్తే త్వరగా అయిపోతున్నాయని స్థానికులు తెలిపారు. ఏళ్ల తరబడి ఈ తతంగం నడుస్తున్నా.. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారిందని మండల ప్రజ లు చెబుతున్నారు. గతంలో విధుల్లో నిర్లక్ష్యం, ఇసుక అక్రమ రవాణాకు కొమ్ముకాయడం, భూ తగాదాలతోపాటు ప్రజాప్రతినిధులకు అనుకూలంగా లేని కారణాలతో తక్కువ కాలంలోనే ఏడుగురు తహసీల్దార్లపై బదిలీవేటు పడింది.

సాంకేతిక నైపుణ్యంతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

- ఎస్పీ తుహిన్ సిన్హా



సైబర్ నేరాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి : కంప్యూటర్ నైపుణ్యం, మెలకువలతో సైబర్ మోసాలను సులభంగా ఛేదించవచ్చని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. స్థానిక గుండాల జంక్షన్ ఎస్.ఆర్.శంకరన్ సమావేశం హాల్లో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పోలీసు అధికారులు, ఐటీ కోర్ సిబ్బందికి సైబర్ నేరాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ మోసాల కేసులు, సోషల్ మీడియా కేసుల దర్యాప్తునకు సంబంధించి ప్రత్యేకమైన టూల్స్ ద్వారా కచ్చితమైన సమాచారం, నేరానికి పాల్పడిన ప్రదేశం గుర్తించవచ్చన్నారు. దర్యాప్తునకు ఉపయోగపడే సాంకేతిక నైపుణ్యం అభివృద్ధి చేసుకోవడం ద్వారా అధికారులు సైబర్ నేరాలను అదుపు చేయవచ్చన్నారు. సైబర్ నేరాలు జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే నగదు పోకుండా రక్షించవచ్చన్నారు. అనకాపల్లి జిల్లాకు సంబంధించి నేటి వరకూ రూ.కోటి 20 లక్షలు పట్టుకున్నామని, సంబంధిత కోర్టుల ద్వారా త్వరలో బాధితులకు అందజేయడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో చోరీల కంటే సైబర్ మోసాల ద్వారా ప్రజలు ఎక్కువ మొత్తంలో నగదు పోగొట్టుకునే అవకాశం ఉందన్నారు. అందువల్ల అధికారులు ఇటువంటి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల ద్వారా పటిష్టమైన దర్యాప్తు చేసి ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. సైబర్ నిపుణుడు సాయి రామానుజ మాట్లాడుతూ సైబర్ నేరాలను, మోసాలను ఛేదించడం చాలా సులభమని, అందుకు అవసరమైన అవగాహన, వృత్తి నైపుణ్యం దర్యాప్తు అధికారులకు అవసరమన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వేదికగా జరుగుతున్న వేధింపులు, ఓటీపీ ఫ్రాడ్స్, ఆర్థిక మోసాలు, మొబైల్ లోను యాప్స్ వంటి నేరాల్లో దర్యాప్తు ఏవిధంగా చేయాలి, సాక్ష్యాలను ఏవిధంగా సేకరించాలి, నిందితులను ఏవిధంగా గుర్తించాలన్న విషయాలను పోలీసు అధికారులకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు బి.అప్పారావు, ఎం.శ్రావణి, కె.వి.సత్యనారాయణ, జి.ఆర్.ఆర్.మోహన్, సీఐ టి. కల్యాణి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలల గుర్తింపునకు ప్రశస్త్ యాప్ సర్వే

చోడవరం రూరల్: దివ్యాంగ బాలలను గుర్తించడానికి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రశస్త్ యాప్ ద్వారా విద్యార్థుల స్క్రీనింగ్ సర్వేను వేగవంతం చేయాలని సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయ కర్త శకుంతల కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని భవిత విద్యా కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులతో సరదాగా గడిపారు. వారిని ఆడించి, స్వల్ప ప్రశ్నలకు వారి నుంచి సమాధానాలు రాబట్టారు. ప్రత్యేక ఉపాధ్యాయులు సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణా

- అక్రమార్కులకు అధికారుల అండదండలు
- మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు



కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీ కొంతమంది నాయకులకు అక్రమ సంపాదనకు మార్గమైందని మాజీ ఎమ్మెల్సీ డి.వి. సూర్యనారాయణరాజు ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వరాహ, సర్పా నదుల నుంచి ఇసుక దోపిడీ ఎక్కువగా జరుగుతోందన్నారు. కొంతమంది నిత్యం పదుల సంఖ్యలో లారీల్లో ఇసుకను అక్రమ రవాణా చేసి రూ.లక్షల్లో సంపాదిస్తున్నారని ఆరోపించారు. గొట్టివాడ ప్రాంతంలో ఏడు పాయింట్ల వద్ద ఇసుకను నిల్వ చేసి ట్రాక్టర్లు, లారీల్లో అక్రమంగా తరలిస్తున్నారని చెప్పారు. కళ్ల ముందే ఇంత దోపిడీ జరుగుతున్నా మైనింగు, రెవెన్యూ, పోలీసు శాఖాధికారులు ఎందుకు చోద్యం చూస్తున్నారని ప్రశ్నించారు. దోపిడీని అడ్డుకోవలసిన అధికారులకు తెలిసే ఈ వ్యవహారమంతా జరుగుతున్నట్టు స్పష్టమవుతోందని, ఇందులో వారి పాత్ర కూడా ఉన్నట్టు అనుమానం కలుగుతోందన్నారు. మామిడి తోటలు, ఇళ్ల మధ్య, కొండల వెనుక, రహదారుల పక్కన ఇసుకను నిలువ చేసి, విక్రయాలు చేస్తున్నారని చెప్పారు.

ఇదే కొనసాగితే కొద్ది రోజుల్లో వరాహనదిలో ఇసుక మాయమై భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందన్నారు. ఈ ప్రాంత రైతులకు తీవ్రంగా నష్టం జరుగుతుందని చెప్పారు. పెద్ద ఎత్తున జరుగుతున్న ఇసుక దోపిడీపై ఇప్పటికే తహసీల్దారుకు ఫిర్యాదు చేశామని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు.

క్లుప్తంగా

పోలీసులను తప్పించుకునే క్రమంలో..

- మరో బైక్‌కు ఢీకొన్న యువకుల వాహనం
- వృద్ధుడు మృతి.. అతని కుమారుడికి గాయాలు



శరగడం సూర్యనారాయణ మృతదేహం

దేవరాపల్లి: దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల సరిహద్దులో ముషిడిపల్లి జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందగా, కుమారుడు గాయపడ్డాడు. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. అనకాపల్లికి చెందిన శరగడం సూర్యనారాయణ (60), ఆయన కుమారుడు వెంకటేష్ దేవరాపల్లిలోని తమ వ్యవసాయ భూముల్లో పనులు చూసుకొని శుక్రవారం సాయంత్రం తిరుగు పయనమయ్యారు. ఇదే సమయంలో కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల సరిహద్దులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎల్.కోటకు చెందిన ఇద్దరు యువకులు పోలీసులను చూసి భయంతో తమ బుల్లెట్ వాహనాన్ని దేవరాపల్లి వైపు తిప్పే క్రమంలో ఎదురుగా వస్తున్న తండ్రీ కొడుకుల బైక్‌ను బలంగా ఢీకొట్టారు. దీంతో బైక్ వెనుక కూర్చున్న శరగడం సూర్యనారాయణ (60) రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రుడిని కె.కోటపాడు 50 పడకల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ఆస్పత్రి వైద్య సిబ్బంది నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు దేవరాపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో ఆటోలు

దేవరాపల్లి: దేవరాపల్లిలో అక్రమంగా తరలిస్తున్న రెండు టన్నుల రేషన్(పీడీఎస్) బియ్యాన్ని విజిలెన్స్, పౌర సరఫరాల అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. దేవరాపల్లి నుంచి భారీగా పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం తెల్లవార జామున విజిలెన్స్ అధికారి రవికుమార్, సివిల్ సప్లయి అధికారి సాయిరాం తమ సిబ్బందితో కలిసి సంయుక్తంగా దాడి చేశారు. దేవరాపల్లి నుంచి మారేపల్లి వెళ్లే రహదారిలో రెండు పాసింజర్ల ఆటోలో తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకుని దేవరాపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రెండు ఆటోల్లో ఉన్న 40 బస్తాల బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులకు అప్పగించారు. బియ్యం తరలిస్తున్న ఇద్దరు యజమానులు త్రినాథ్, విశ్వేశ్వరరావు పాటు ఆటో డ్రైవర్లపై విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేశారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



ప్రారంభోత్సవం సందర్భంగా క్రీడాకారులు చేస్తున్న విన్యాసాలు



బాలికల విభాగంలో తలపడుతున్న జట్లు

- జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు
- రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు ప్రారంభం

నక్కపల్లి: విద్యార్థి దశ నుంచే విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి జి.అప్పారావు నాయుడు అన్నారు. శుక్రవారం నక్కపల్లిలో మూడు రోజుల పాటు జరిగే అండర్-14 బాల బాలికల రాష్ట్ర స్థాయి హాకీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకుని ధ్యాన్‌చంద్ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలకు పేదరికం అడ్డు కాదన్నారు. తాను చదువుకునే రోజుల్లో క్రీడల్లోను రాణించి ఎన్నో పతకాలను సాధించానని చెబుతూ విద్యార్థుల్లో స్ఫూర్తినింపారు. అనంతరం ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి రాజు మాట్లాడుతూ నక్కపల్లిలో రాష్ట్ర సాయి హాకీ టోర్నమెంట్ రెండోసారి నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి 13 జిల్లాల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, సర్పంచ్ నేతల జయరత్న కుమారి, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఉప సర్పంచ్ వీసం రాజు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈవోలు నరేష్, నూకరాజు, బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపకుడు సూరిబాబు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.



బాలుర విభాగంలో తలపడుతున్న జట్లు

తొలి రోజు పోటీలు ఇలా సాగాయి.

బాలుర విభాగంలో..

- తూర్పు గోదావరి- కర్నూలు మ్యాచ్‌లో 4-0తో తూర్పు గోదావరి విజయం సాధించింది.
- ప్రకాశం-విజయనగరం మధ్య మ్యాచ్‌లో 1-1తో టైగా ముగిసింది.
- గంటూరు-శ్రీకాకుళం మ్యాచ్‌లో 1-0 తేడాతో గుంటూరు విజయం సాధించింది.
- కృష్ణ-నెల్లూరు మధ్య మ్యాచ్‌లో 1-0 తేడాతో నెల్లూరు విజయం సాధించింది.
- అనంతపురం-పశ్చిమ గోదావరి మ్యాచ్‌లో 1-2 తేడాతో అనంతపురం విజయం సాధించింది.

బాలికల విభాగంలో..

- నెల్లూరు-కృష్ణా మ్యాచ్‌లో 0-2 తేడాతో కృష్ణ విజయం సాధించింది.
- తూర్పు గోదావరి-శ్రీకాకుళం మ్యాచ్‌లో 1-0 తేడాతో తూర్పు గోదావరి విజయం సాధించింది.
- విజయనగరం-కర్నూలు మధ్య మ్యాచ్ 0-0తో టైగా ముగిసింది.
- చిత్తూరు-ప్రకాశం మ్యాచ్ కూడా 0-0తో టైగా ముగిసింది.
- పశ్చిమ గోదావరి-గుంటూరు మ్యాచ్ కూడా 0-0తో టైగా ముగిసింది.

అధికారుల అవినీతితో గ్రామ కంఠం భూములు అన్యాక్రాంతం

- సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు వెంకన్న ధ్వజం

దేవరాపల్లి: మేజర్ పంచాయితీ దేవరాపల్లి సర్వే నంబర్ 259/2 పినకోట వైపు వెళ్లే రోడ్డుకు ఆనుకొని ఉన్న గ్రామ కంఠం స్థలాలను అమ్మిన, కొనుగోలు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి వినతి పత్రం అందజేశారు. దేవరాపల్లిలో సచివాలయం-2 ఎదురుగా ఉన్న గ్రామ కంఠం స్థలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. తప్పుడు సర్వే నంబర్లతో కొనుగోలు చేసిన గ్రామ కంఠం భూములకు పంచాయతీ ప్లాన్ అప్రూవల్ ఇవ్వవద్దని స్థానిక పంచాయతీ కార్యదర్శి ఉమాదేవికి లిఖిత పూర్వకంగా వెంకన్న ఫిర్యాదు చేశారు. అనంతరం వెంకన్న మాట్లాడుతూ దేవరాపల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 259/2లో సుమారు కోటి రూపాయలు విలువ చేసే గ్రామ కంఠం స్థలాన్ని దేవరాపల్లికి చెందిన గొర్లె దేముడమ్మ ఇదే గ్రామానికి చెందిన చిట్టూరు గంగరాజు, బేతపూడికి చెందిన గుంపెన రేవతి, కాశీపురానికి చెందిన గండి గోవిందరావుకు గత ఏడాది విక్రయించారని ఆరోపించారు. అప్పటి వీఆర్వో నూకరాజు అమ్మకానికి అవసరమైన ధృవపత్రాన్ని జారీ చేయడంతో కె.కోటపాడు రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్లు చేశారని, సదరు వీఆర్వోపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు మామూళ్లకు కక్కుర్తి పడి ఇష్టానుసారం ధృవపత్రాలు జారీ చేయడంతో కోట్ల విలువ చేసే గ్రామ కంఠం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని విమర్శించారు. గతంలో కొబ్బరి తోట, పాత డంపింగ్ యార్డు స్థలాలను విక్రయించేందుకు సిద్ధపడగా సీపీఎం అడ్డుకుందన్నారు. ఆ తర్వాత పాత డంపింగ్ యార్డులోని కొంత స్థలంలో గ్రామ సచివాలయ భవనం, కొబ్బరి తోట స్థలంలో విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం నిర్మించారన్నారు. తర్వాత పాత డంపింగ్ యార్డులో మిగిలిన స్థలాన్ని గుట్టు చప్పుడు కాకుండా తప్పుడు సర్వే నంబర్లతో అమ్మేశారని ధ్వజమెత్తారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ కంఠం స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకుంటే, సీపీఎం జెండాను పాతి భూములను పరిరక్షిస్తామని వెంకన్న స్పష్టం చేశారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు వెంకన్న

1400 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



బెల్లం పులుపును ధ్వంసం చేస్తున్న ఎస్ఐ శేఖరం

కె.కోటపాడు: కొరువాడ గ్రామంలో నాటుసారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. చోడవరం ఎక్సైజ్ సీఐ పాపునాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ ఎం.శేఖరం సిబ్బందితో కలిసి గ్రామ శివారులో సారా తయారీ ప్రాంతాన్ని గుర్తించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1400 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేయడంతో పాటు సంఘటన స్థలంలో ఉన్న 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.

నరసింగబిల్లిలో సినిమా షూటింగ్ సందడి

కోటకోట: మండలంలోని నరసింగబిల్లి నూకాంబిక ఆలయంలో షూటింగ్ సందడి నెలకొంది. తపస్వీ ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్‌పై నూతన నటీనటులతో నిర్మిస్తున్న ఇంకా పేరు పెట్టని ప్రొడక్షన్ నంబర్-1 సినిమా షూటింగ్ ప్రారంభోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో పూజలు నిర్వహించి ముహూర్తపు షాట్‌ను హీరో నాగార్జున(జూనియర్), హీరోయిన్ ఆద్యారెడ్డిపై చిత్రీకరించారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవిందసత్యనారాయణ క్లాప్ కొట్టి మూహూర్తపు షాట్‌ను ప్రారంభించారు. మరో హీరోయిన్ భావన రెడ్డి(హైదరాబాద్) నటిస్తున్నారు. పూర్తి గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమా కథకు ఎంచుకున్న మేరకు మండల పరిసర ప్రాంతాల్లో ఒకే షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తి చేస్తామని దర్శకుడు పల్లా అనిల్ తెలిపారు.



ముహూర్తపు షాట్ కొట్టి షూటింగ్ ప్రారంభిస్తున్న గోవింద సత్యనారాయణ

మంచి నటిగా గుర్తింపే లక్ష్యం



మంచి సినీనటిగా గుర్తింపు తెచ్చుకోవాలని కృషి చేస్తున్నట్టు వర్ధమాన సినీనటి ఆద్యారెడ్డి తెలిపారు. షూటింగ్‌లో భాగంగా తనను కలిసిన విలేకరులతో ఆమె మాట్లాడారు. హైదరాబాద్‌లో నటనలో శిక్షణ పొంది సినీ రంగ ప్రవేశం చేశానన్నారు. ఇప్పటికే మూడు సినిమాల్లో నటించినట్టు చెప్పారు. వాటిలో కోటబొమ్మాళి సినిమా రిలీజు అయిందన్నారు. ఉద్వేగం సినిమా రిలీజు కావలసి ఉందన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న సినిమాలో హీరో నాగార్జున జూనియర్‌తో జోడీగా ప్రధాన హీరోయిన్‌గా నటిస్తున్నానని చెప్పారు.

75 మద్యం బాటిళ్లు సీజ్



సీజ్ చేసిన మద్యం బాటిళ్లు

చోడవరం : గౌరీపట్నం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 75 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ బాపునాయుడు శుక్రవారం తెలిపారు. గౌరీపట్నం వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు 75 మద్యం బాటిళ్లను తరలిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. మద్యం సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేశామని చెప్పారు. అదేవిధంగా పలు చోట్ల నిబంధనలకు విరుద్ధంగా మద్యం బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్న 14 మందిపై బైడోవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు.

40 కేజీల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన వ్యక్తులు, కార్లతో దేవరాపల్లి పోలీసులు

దేవరాపల్లి: అల్లూరి జిల్లా నుంచి రెండు కార్లలో తరలిస్తున్న 40 కేజీల గంజాయిని దేవరాపల్లి పోలీసులు గురువారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నలుగురు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను అదుపులోకి తీసుకోగా.. కేరళా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి పరారైనట్టు దేవరాపల్లి అదనపు ఎస్ఐ బి.మల్లికార్జునరావు శుక్రవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. అదనపు ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి జిల్లా నుంచి దేవరాపల్లి మీదుగా రెండు కార్లలో గంజాయిని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారంతో శ్రీరాంపురం సమీపంలోని చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఒక కారులో 2 కేజీలు, మరో కారులో 38 కేజీలు గంజాయి పట్టుబడింది. కేరళకు చెందిన విఘ్నేష్ అలియాస్ విక్కి కారుతో బీభత్సం సృష్టించి కారును విడిచి పెట్టి పరారీ అయ్యాడు. ఈయన కొంత కాలంగా అరకులో నివాసం ఉంటున్నాడు. పోలీసులకు పట్టుబడిన వారిలో కేరళకు చెందిన ఫవస్కు కురంగాట్, సల్మాన్ ఫారిస్, మహ్మద్ షిజాస్, శరున్ షాజీ ఉన్నారు. రెండు కార్లు, 40 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నలుగురు నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు అదనపు ఎస్ఐ తెలిపారు.

కక్ష సాధింపుతోనే సస్పెన్షన్

- విధి నిర్వహణలో అలసత్వంపై ప్రశ్నించినందుకు కక్ష పెంచుకున్న పీహెచ్‌సీ సిబ్బంది
- వారితో కలిసి ప్రధాన వైద్యాధికారి వేధింపులు
- నాపై ఉన్నవి తప్పుడు ఆరోపణలు.. నాకు న్యాయం చేయాలి
- పెనుగొల్లు పీహెచ్‌సీ మాజీ వైద్యుడు రామ్‌నాయక్



ఎస్.రాయవరం: విధి నిర్వహణలో అలసత్వంపై ప్రశ్నించినందుకే తనపై కక్ష పెంచుకున్న పీహెచ్‌సీ సిబ్బంది తప్పుడు ఆరోపణలతో ఫిర్యాదు చేశారని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యుడు బి.ఎల్.రామ్‌నాయక్ స్పష్టం చేశారు. కక్షసాధింపుతో సస్పెండ్ చేసి, విధులకు దూరంగా పెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డురోడ్డులో శుక్రవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. సక్రమంగా పనిచేయాలని వైద్యాధికారిగా ఆదేశాలు చేశానని, దీంతో పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి పి.రాజేశ్వరితో కలిసి సిబ్బంది తనపై తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. ఆ ఫిర్యాదుపై ప్రాథమిక విచారణ కూడా చేపట్టకుండా తనను సస్పెండ్ చేశారన్నారు. దీనిపై కోర్టును ఆశ్రయించడంతో స్టే విధించిందన్నారు. దీంతో పెనుగొల్లు పీహెచ్‌సీలో విధుల్లో చేరేందుకు వెళ్లగా.. జిల్లా వైద్యాధికారి మరో 20 రోజు కాలయాపన చేశారని ఆయన ఆరోపించారు. మరో డాక్టర్‌ను డిప్యుటేషన్‌పై తీసుకువచ్చి బాధ్యతలు అప్పగించారు తప్ప, తాను విధులు నిర్వహించే అవకాశం కల్పించలేదన్నారు. ఇలా 10 నెలల పాటు జీతం తీసుకుని, పీహెచ్‌సీలో ఖాళీగా కూర్చుని వచ్చేవాడినని నాయక్ చెప్పారు. ఈ విషయంపై కొత్త డీఎంహెచ్‌వోకు విన్నవించగా తనను యథావిధిగా విధులు నిర్వహించుకోవాలని సూచించారన్నారు. మూడు నెలలుగా సక్రమంగా విధులు చేసుకుంటున్న తనను మరోసారి ప్రధాన వైద్యాధికారి రాజేశ్వరి లైంగికంగా వేధిస్తున్నట్టు ఫిర్యాదు చేయడంతో సస్పెండ్ చేసినట్టు అక్టోబర్ 14న ఫోన్ ద్వారా తెలియజేశారని నాయక్ చెప్పారు. మరుసటి రోజున యథావిధిగా విధులకు హాజరైన తనకు యూడీసీ రమేష్ సస్పెండ్ ఆర్డర్ చేతికి ఇచ్చారన్నారు. అదే నెల 19న వైద్య సిబ్బంది విచారణకు రాగా.. ఫిర్యాదులో ఆరోపణలు పక్కన పెట్టి, పీహెచ్‌సీకి వచ్చే రోగులను తన ప్రైవేటు క్లినిక్‌కు పంపకపోతే చంపేస్తారని సిబ్బందిని బెదిరించినట్టు చెప్పించారని ఆయన విమర్శించారు. మద్యం సేవించి విధులకు హాజరయ్యానని, స్టాఫ్‌నర్సులతో అసభ్యకరంగా ప్రవర్తించానని నివేదికలో పొందుపర్చారన్నారు. దీనిపై అమరావతి ప్రజావేదికలో ఫిర్యాదు చేశానన్నారు. తాను ఎటువంటి తప్పులు చేయలేదని, తనపై కక్షపూరితంగా తప్పుడు ఆరోపణలతో చర్యలు తీసుకున్నారని, తనకు న్యాయం చేయాలని కోరారు.

గంజాయి నిందితునికి పదేళ్ల జైలు

- రూ.లక్ష రూపాయల జరిమానా

చోడవరం రూరల్ : గంజాయి రవాణా కేసులో అభియోగం రుజువు కావడంతో నిందితునికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ చోడవరంలోని 9వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.రత్నకుమార్ శుక్రవారం తీర్పు విడుదల చేశారు. కేసులో మరో ఇద్దరు నిందితులలో ఒకరు నిందితుని తండ్రి మృతి చెందగా, మరో వ్యక్తి నిర్దోషిగా పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ తుహిన్‌సిన్హా అందించిన వివరాలివి. చీడికాడ మండలం బయలుపూడి గ్రామానికి చెందిన గాడి కోటేశ్వరరావు కుమారుడు శ్రీను 2025, జనవరి 17న ఉదయం అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా చీడికాడ ఎస్ఐ డి.విశ్వనాథంకు పట్టుబడ్డాడు. చుక్కపల్లి జంక్షన్ వద్ద ఎస్ఐ తన సిబ్బందితో తనిఖీ నిర్వహిస్తుండగా నిందితుడు గాడి శ్రీనుతో పాటు మరో ఇద్దరు కలసి రెండు వాహనాలపై మూటల్లో 30 కేజీల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. గంజాయిని, వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులను ఎస్ఐ అరెస్టు చేశారు. కేసు విచారణ అనంతరం అదనపు జిల్లా సెషన్స్ జడ్జి రత్నకుమార్ నిందితుడు శ్రీనుకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో రెండున్నర సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో స్పష్టం చేశారు. ప్రాసిక్యూషన్ తరపున ఉగ్గిన వెంకటరావు తన వాదనలు వినిపించారు. కేసును పకడ్బందీగా దర్యాప్తు జరిపి, ఛార్జిషీటు దాఖలు చేసి, సాక్షులను సకాలంలో హాజరుపరచి నిందితునికి కఠిన శిక్ష పడేలా చేసిన పి.పి, ఎస్ఐ, సిబ్బంది, కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

నూకాలమ్మా.. కరుణించమ్మా..





కొలువైన నూకాంబిక అమ్మవారు, వెల్చూరులో నిర్మించిన ఆలయంలో భక్తుల సందడి

- వెల్చూరులో అమ్మవారి ఆలయం పునః ప్రారంభం
- శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శ్రీపీఠం పరిపూర్ణానందస్వామి
- భారీ అన్నసమారాధన.. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రారంభోత్సవంలో పాల్గొన్న పరిపూర్ణానంద స్వామి

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం వెల్చూరు గ్రామ దేవత నూకాలమ్మ అమ్మవారి ఆలయ పునః ప్రారంభం శుక్రవారం ఘనంగా జరిగింది. అమ్మవారి పురాతన ఆలయాన్ని దాత పిన్నమరాజు సుధీర్‌రాజు ఆర్థిక సహాయంతో కమిటీ సభ్యులు పునర్నిర్మించారు. కాకినాడ శ్రీపీఠం పరిపూర్ణానందస్వామి చేతుల మీదుగా వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నూకాంబిక అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ గోపురంపై ప్రతిష్ఠించిన కలశాలపై భక్తులు బూరెలను ప్రసాదంగా వేశారు. ఆ బూరెలను దక్కించుకోవడం కోసం భక్తులు పోటీ పడ్డారు. అనంతరం యాగశాలలో కుంకుమ పూజలు, పూర్ణాహుతి జరిపారు. సంతపాలెం, పెదకలవలాపల్లి, అప్పన్నపాలెం, గొరపూడి, వైలోవ రాజకోడూరు. కృష్ణంపాలెం పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చి అమ్మవారికి చీర, సారె సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కోలాటం, తప్పెటగుళ్ల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులకు అన్నదానం చేశారు. యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, వైఎస్సార్‌సీపీ నేతలు, కూటమి నేతలు, తదితరులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.

క్లుప్తంగా

అయ్యప్పస్వామి ఆలయంలో ఉచితంగా భిక్ష



అయ్యప్పస్వామి ఆలయంలో భిక్ష స్వీకరిస్తున్న స్వాములు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు అయ్యప్ప స్వామి ఆలయంలో మాలాధారణ చేసే స్వాములకు మధ్యాహ్నం ఉచితంగా భిక్షను అందజేస్తున్నట్టు ఆలయ అధ్యక్షుడు కటకం లక్ష్మణరావు చెప్పారు. శుక్రవారం పట్టణ, మండల పరిధిలో 400 మందికి భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1వ తేదీ వరకు ఉచిత భిక్ష సదుపాయం కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ సభకు 594 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కశింకోట: ఉగ్గినపాలెంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభకు గతంలో ఏ సభకు రాని సంఖ్యలో అత్యధికంగా 594 అర్జీలు వచ్చాయి. పెద్ద సంఖ్యలో రైతులు హాజరై భూముల విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు సరి చేయాలని, రీసర్వేలో లోపాలు సవరించాలని, కుటుంబంలో పంపకం చేసిన భూములకు కొత్తగా పాసు పుస్తకాలు అందించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. అర్జీలు సమగ్రంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. మండల సర్వేయర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తం

అనకాపల్లి: ప్రస్తుతవాతావరణ పరిస్థితుల కారణంగా వరి పైరుకు తెగుళ్ల ఆశించే అవకాశం ఉందని, రైతులుఅప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ వ్యవసాయపరిశోధనా స్థానం ఏడీ ఆర్ సీహెచ్.ముకుందరావు శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. వీటి నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును 2 గ్రాములు లేదా అసిఫేట్ 1.5గ్రాములను లీటరు నీటికికలిపి పిచికారీ చేయాలని తెలిపారు. చెరకులో పిండినల్లి ఉధృతి పెరిగి మొజాయిక్ తెగులును వ్యాప్తి చేస్తుందని, నివారణకు ఆకులు తుంచి, డైమిథోయేట్ 2 మిల్లీలీటర్లు, లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 1,118 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,900	4,900
మొదటి రకం	3,940	4,360
రెండో రకం	3,560	3,970
మూడోరకం	3,400	3,540

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
'క'	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
అప్పుడో ఇప్పుడో ఎప్పుడో	: షిర్డిసాయి
బ్లడీ బెగ్గర్	: షిర్డిసాయి
ధూం ధాం	: వెంకటేశ్వర
విశ్వం	: శ్రీసత్య
లక్కీ భాస్కర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-3 యూనిట్లు, బి పాజిటివ్-14 యూనిట్లు, ఒ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ య.లోకేషను (ఫోన్ నంబర్ 9703619706)లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 359 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి(ఫోన్ నంబర్ 08924-223595) ను సంప్రదించవచ్చు.

దడ పుట్టిస్తున్న సుడిదోమ



తెగుళ్లపై రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ సిబ్బంది



తెగులు సోకడంతో ఏర్పడిన మచ్చలు

- భయ పెడుతున్న పొడ తెగులు
- ఆందోళనలో రైతులు
- నివారణ చర్యలపై అధికారుల సూచనలు

తుమ్మపాల: వరి సాగు చేస్తున్న రైతులకు సుడిదోమ, పొడ తెగుళ్లు దడ పుట్టిస్తున్నాయి. పొట్ట దశకు చేరుతున్న వరికి ఈ రెండు తెగుళ్లు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట దిగుబడులపై ఈ తెగుళ్ల ప్రభావం ఉంటుందంటున్నారు. తెగుళ్ల ఉధృతి మధ్యస్తంగా ఉందని, సకాలంలో యాజమాన్య చర్యలు తీసుకుంటే దిగుబడులను రక్షించుకోవచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అనకాపల్లి మండలంలో సుమారు 6,500 ఎకరాలు, కశింకోట మండలంలో 3,440 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట గింజ గట్టి పడే దశ లో ఉంది. కొన్ని ప్రాంతాల్లో కోతలకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో పంటకు సుడిదోమ, పొడ తెగుళ్లు ఆశించడంతో రైతులకు కంటి మీద కునుకు కరువైంది.

క్షేత్ర సందర్శనతో తెగుళ్ల గుర్తింపు

ఆచార్య ఎన్జీరంగ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం మండలంలో వ్యవసాయాధికారులు, రైతులతో కలిసి వరి పొలాలను సందర్శిస్తున్నారు. కోతకు సిద్ధమవుతున్న సమయంలో పంటను సుడిదోమ, పొడ తెగుళ్లు ఆశించినట్టు బృందం గుర్తించింది. తెగుళ్ల వ్యాప్తి మధ్యస్తంగా ఉందని నిర్ధారించింది. తెగుళ్ల వ్యాప్తిని గుర్తించిన వెంటనే తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో రైతులకు సూచనలు, సలహాలను ఇప్పటికే అందించింది.

సుడిదోమ లక్షణాలు : వరి చేను కాండంపై కోలగా, ఆకుపచ్చ నుంచి బూడిద రంగులో నీటిలో నానబెట్టినట్లు చారలు కనిపిస్తాయి.ఈ మచ్చలు సుమారు ఒకటి నుంచి మూడు సెంటీ మీటర్ల పొడవు ఉండి క్రమేపీ పెరిగి బూడిద నుంచి తెలుపు రంగులోకి మారుతాయి. తెగుళ్ల ఉధృతి అధికంగా ఉంటే మొక్క భాగాలకు సోకి ఆకులు పూర్తిగా ఎండిపోయి చనిపోతాయి.

నివారణ చర్యలు : పంట పొలంలో సమగ్ర కలుపు, ఎరువుల యాజమాన్యం చేపట్టాలి. సుడిదోమ తెగులును నివారించుకోవడానికి హెక్సాకొనజోల్ 5 ఈసీ 2.0 మిల్లీలీటర్లు లేదా వాలిడామైసిన్ 2.0 మిల్లీలీటర్లు లేదా ప్రొపికొనజోల్ 1.0 మిల్లీలీటర్లను లీటరు కలిపి పిచికారీ చేయాలి.తెగుళ్ల ఉధృతి అధికంగా ఉంటే ట్రైఫ్లోక్సిస్ట్రోబిన్, టేబుకొనజోల్ 0.4 మిల్లీలీటర్లు/ అజోక్సిస్ట్రోబిన్, టేబుకొజనోల్ 1.5 మిల్లీలీటర్లు/ అజోక్సిస్ట్రోబిన్, డైఫినోకొనజోల్ 1.0 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- పొడ తెగులు నివారణకు హెక్సాకోనజోల్ అనే మందు రెండు మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే లీటరు నీటికి 1.5గ్రాముల ఎసిపెట్ లేదా బీప్రొఫ్యుసన్ 2.5 మిల్లీలీటర్లను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

వ్యాప్తికి కారణాలు

మబ్బులతో కూడిన వాతావరణం, వర్షాలు కురవడం, ఎక్కువ తేమశాతం ఉన్న వాతావరణ పరిస్థితులు ప్రధాన కారణం. ఉష్ణోగ్రతలు 29 నుంచి 32 డిగ్రీల లోపు ఉండడం, నత్రజని సంబంధ ఎరువులు అధిక మోతాదులో వాడడం, పొలం గట్లపైన కలుపు మొక్కలు ఎక్కువగా ఉండడం, వరి పైరులో మొక్కల సాంద్రత అధికంగా ఉండటం (మొక్కలను దగ్గరగా నాటుకోవడం).

తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది



వరిలో తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది. నీటి సౌకర్యం లేకపోవడంతో పలు రకాల తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. అధికంగా సుడిదోమ వ్యాపించడంతో వరిలో దుబ్బులు వృద్ధి చెందడం లేదు. వరి పొట్ట దశలో ఉంది. గింజ కట్టే సమయంలో ఇలా తెగుళ్లు రావడం ఆందోళనగా ఉంది. అధికారుల సూచనలతో మందులు పిచికారీ చేస్తున్నాం. మరో పక్క పొట్ట దశలో మందులు పిచికారీ మంచిది కాదంటున్నారు.

–కరణం నాయుడు, రైతు, రేబాక గ్రామం.

జాగ్రత్తలు వహిస్తే అధిక దిగుబడులు



పంట చేతికి వచ్చే సమయంలో సుడిదోమ, పొడ తెగుళ్లు కనిపిస్తున్నాయి. తెగుళ్లను గుర్తించిన వెంటనే వాటి వ్యాప్తి స్థితిని బట్టి పొలంలో యాజమాన్య చర్యలు తీసుకోవాలి. అప్పుడే దిగుబడులకు నష్టం వాటిల్లకుండా ఉంటుంది. కలుపు, ఎరువుల యాజమాన్యం కూడా ముఖ్యమైంది. జాగ్రత్తలు వహిస్తే అధిక దిగుబడులు చేతికి అందుతాయి.

– పి.రంగాచారి, మండల వ్యవసాయ అధికారి, అనకాపల్లి మండలం

నీటి సంఘాల ఓటర్ల జాబితాలో తప్పులు సరిచేయాలి



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, రైతులు



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త భరత్‌కుమార్

అనకాపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంఘాల ఎన్నికల్లో ఓటర్లు లిస్టులో తప్పులు సరిచేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ ఆధ్వర్యంలో నియోజకవర్గ నీటిసంఘాల రైతులు, నాయకులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 సంవత్సరాల క్రితం ఉన్న జాబితాను తొలగించి, ప్రస్తుత 1బి లిస్టులో ఉన్న రైతులకు ఓటు హక్కు కల్పించేందుకు కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

నీటిసంఘాల ఎన్నికల్లో ఓటు వేసేందుకు 1బిలో పేర్లు ఉన్న రైతులు ఈనెల 12వ తేదీలోపు ఓటరు లిస్టులో నమోదు చేసుకోవాలని, సంఘాల ఎన్నికలు ఈనెల 23న జరుగుతాయని ఆయన చెప్పారు. ప్రభుత్వం విడుదల చేసిన ఓటరు జాబితాలో చాలా తప్పులు ఉన్నాయని, వాటిని తక్షణమే సరిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారని, వైఎస్సార్‌సీపీ పాలనలో వారికి ఎంతో మేలు జరిగిందని చెప్పారు. నియోజకవర్గంలో అనకాపల్లి మండలంలో 14, పట్టణంలో 3, కశింకోట మండలంలో 6 నీటి సంఘాలకు త్వరలో ఎన్నికలు జరుగుతాయని, ఈ ఎన్నికల్లో పోటీ చేసే పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ విశాఖ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థిని ఎలా గెలిపించుకున్నామో, గ్రామాల్లో పార్టీశ్రేణులు నీటిసంఘాల అభ్యర్థులను అదే విధంగా గెలిపించునే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ గ్రామాల్లో 1బి ప్రకారం ఓటరు జాబితాలో పేర్లు ఉన్నదీలేనిదో పార్టీశ్రేణులు పరిశీలించాలన్నారు. పార్టీ కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్ మాట్లాడుతూ నీటిసంఘాల ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. సంఘాల ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు తప్పనిసరిగా నీటిపన్ను బకాయిలు లేకుండా చూసుకోవాలన్నారు. మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ భూమి కలిగిన ప్రతి రైతుకు ఓటు హక్కు ఉంటుందని, గ్రామాల్లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, రాష్ట్ర గవరకార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, అన్నపూర్ణబ్యాంక్ మాజీ ఛైర్మన్ పి.డి. గాంధీ, కశింకోట ఎంపీపీ కలగ లక్ష్మీగున్నయ్యనాయుడు, విశాఖపాల డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, వైఎస్సార్‌సీపీ కశింకోట మండల మహిళా విభాగం అధ్యక్షురాలు నీటిపల్లి లక్ష్మి, పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

అనకాపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో బొప్పే ఉమామహేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన పార్టీ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలవుతున్నప్పటికీ సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని కోరారు. జిల్లా కేంద్రమైనప్పటికీ అనకాపల్లిలో కనీస సౌకర్యాలు లేవని చెప్పారు. మండలంలో రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, అనకాపల్లి-చోడవరంతో పాటు ఇంటర్నల్‌రోడ్లను తక్షణమే బాగుచేయాలని ఆయన కోరారు. పట్టణ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, వల్లూరు గ్రామంలో లాజిస్టిక్ హబ్‌ను ఏర్పాటు చేసి, స్థానికులకు 75శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అనకాపల్లి పట్టణంలో లక్ష్మీదేవిపేట, జీవీఎంసీ విలీనగ్రామమైన సిరసపల్లి,రాజుపాలెం గ్రామంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యుడు జి.కోటేశ్వరరావు, జిల్లా నాయకుడు ఆర్.శంకరరావు, మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, నాయకులు బి.ఉమామహేశ్వరరావు, కె.తేలయ్యబాబు, కనకాల అప్పలరాజు, భీశెట్టి అప్పారావు, జి.సుభాషిణి, నూకఅప్పారావు, ఎర్రంశెట్టి ఏసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీడి మామిడి, మామిడి తోటలకు స్వచ్ఛంద బీమా పథకం



ఉద్యాన వనాల శాఖ అధికారి లావణ్య

కశింకోట: జీడి మామిడి, మామిడి పంటలకు ఈ ఏడాది స్వచ్ఛంద బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్టు ఉద్యాన వన శాఖ అధికారి లావణ్య శుక్రవారం తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పూతలేక పంట దిగుబడి తగ్గి మామిడి, జీడిమామిడి రైతులు ఏటా నష్టపోతున్నారని చెప్పారు. దీంతో ఈ పంటలకు బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. జీడిమామిడికి ఎకరాకు రూ.1,540, మామిడికి రూ.2,200 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. జీడిమామిడికి ఈ నెల 15లోగా, మామిడికి వచ్చే నెల 15లోగా ప్రీమియం సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లోగాని, ఆన్‌లైన్ ద్వారాగాని చెల్లించాలని తెలిపారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకొని వంట నష్టం జరిగినప్పుడు గుర్తించి బీమా పరిహారం చెల్లిస్తారన్నారు. జీడిమామిడికి అయితే ఎకరాకు రూ.30 వేలు, మామిడికి అయితే రూ.40 వేల వరకు బీమా పరిహారం చెల్లిస్తారని తెలిపారు. జీడిమామిడిపై బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న వారు బీమా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అయితే ఎక్కువ రుణం పొందడం కోసం ఇతర పంటలపై తీసుకున్న రుణంపై జీడిమామిడి రైతులకు బీమా వర్తించబోదన్నారు. ఇటువంటి వారు కూడా జీడిమామిడికి బీమా ప్రీమియం చెల్లించుకోవలసి ఉంటుందని చెప్పారు. ఈక్రాపులో పంట నమోదు చేసుకోవాలన్నారు. ఉద్యానవన శాఖ తరఫున ఆయిల్ పాం సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. మొక్కలను ఉచితంగా అందివ్వడంతోపాటు, వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజాపోరు వాల్ పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కశింకోట: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమాన్ని వారం రోజులపాటు నిర్వహించనున్నట్టు సీపీఎం నాయకుడు దాకారపు శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కశింకోటలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఈ నెల 15 వరకు ప్రజాప్రోరు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా పోరు ఉద్యమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా రోజూ ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి ఈ నెల 14న సచివాలయం వద్ద, 15న మండల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామన్నారు. ట్రూఅప్ చార్జీల పేరిట విద్యుత్ చార్జీలు పెంచడం శోచనీయమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి చార్జీలు ఉప సంహరించుకోవాలన్నారు. ఉచిత ఇసుక అందించే విధానాన్ని అమలు చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని,నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, కార్మికులకు నష్టం కలిగించే చట్టాల సవరణను నిలపాలని, రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు జరిగే ప్రజాపోరు కార్యక్రమానికి ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, ప్రజా సంఘాల ప్రతినిధులు ఆర్. అమ్మాజీ, బి. చెల్లయమ్మ, ఎం.సత్యవతి, కుమారి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

'డీఎస్సీ కోచింగ్' స్క్రీనింగ్ టెస్ట్ వాయిదా

తుమ్మపాల: డీఎస్సీ రెసిడెన్షియల్ కోచింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈనెల 10న నిర్వహించవలసిన స్క్రీనింగ్ టెస్ట్ వాయిదా వేసినట్టు ఎస్సీ, ఎస్టీ సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిని కె.రాజేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. టెస్ట్ నిర్వహణ, ప్రవేశాల తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆమె తెలిపారు.

ఘనంగా అయ్యప్ప అంబలం పూజ



పూజలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

కశింకోట: మండలంలోని జోగారావుపేటలో శుక్రవారం రాత్రి అయ్యప్పస్వామి అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజక వర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, యువజన నాయకుడు మలసాల కుమార్‌రాజ, అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

15 నుంచి ఆధార్ అనుసంధానం

అనకాపల్లి: తపాలశాఖ, రాష్ట్రప్రభుత్వ ఆదేశాలమేరకు ఈనెల 15 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్(ఐపీపీబీ) అకౌంట్స్‌కు ఆధార్ అనుసంధానం చేసుకునే అవకాశం కల్పించినట్టు అనకాపల్లి డివిజన్ తపాలశాఖ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల నగదు నేరుగా అకౌంట్లలో పొందడానికి ఆధార్ అనుసంధానం తప్పనిసరని తెలిపారు. అనకాపల్లి డివిజన్ పరిధిలో 2.6లక్షల మంది ప్రజలకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌లో ఆధార్ సీడింగ్ లేకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరడం లేదన్నారు. సచివాలయం పరిధిలో పోస్టు ఆఫీస్‌ద్వారా ఐపీపీబీ అకౌంట్స్‌ను ఓపెన్ చేయడం, ఆధార్ అనుసంధానించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

దివ్యాంగుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి



దివ్యాంగులకు ట్రై సైకిల్, వినికిడి మిషన్లు పంపిణీ చేస్తున్న పాత్రుపల్లి వీరుయాదవ్

అనకాపల్లి: దివ్యాంగుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని విభిన్నప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరు యాదవ్ కోరారు. స్థానిక ఉడ్‌పేట సంఘం కార్యాలయంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సహకారంతో దివ్యాంగులైన రుత్తల లోవరాజుకు ట్రై సైకిల్, వేగి లక్ష్మి, పీలా శ్రీనివాసరావుకు వినికిడి మిషన్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు వివాహ ప్రోత్సాహకాలు ఇవ్వాలని, వ్యాపారాలు చేసుకునే వారికి సబ్సిడీపై రుణాలు అందజేయాలని కోరారు. స్వశక్తితో అభివృద్ధి సాధించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్, సభ్యులు టి.కుమార్, చెట్టుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టిక ఆహారం తయారీ విధానాన్ని చూపిస్తున్న అనుశ్రావణి

అనకాపల్లి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, పిల్లలకు తప్పని సరిగా పౌష్టికాహారం అందజేయాలని వాసవి మహిళా మండల కమ్యూనిటీ కో ఆర్డినేటర్ బి.అనుశ్రావణి తెలిపారు. స్థానిక పెద్దిరాజుపేట అంగన్‌వాడీ కేంద్రంలో వాసవి మహిళా మండలి, విప్రో కేర్ కుశాల్ మెటర్నటీ హెల్త్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు తగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం పౌష్టికాహారం తయారీ విధానాన్ని చూపించారు. ఈ కార్యక్రమంలో పెద్దిరాజుపేట సచివాలయం మహిళా సంరక్ష కార్యదర్శి పద్మ, అంగన్‌వాడీ ఉద్యోగుల, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సుజల స్రవంతితో 2.73 లక్షల ఎకరాలకు సాగునీరు

కశింకోట: ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణం వల్ల జిల్లాలో 2.73 లక్షల ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని పోలవరం ప్రాజెక్టు అనకాపల్లి డివిజన్ డీఈ భాగ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఇక్కడ ఆమె మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో విశాఖలో 0.47 లక్షల ఎకరాలు, విజయనగరంలో 3.86 లక్షల ఎకరాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 0.12 లక్షల ఎకరాలు, శ్రీకాకుళం జిల్లాలో 0.80 లక్షల ఎకరాలు, అనకాపల్లి జిల్లాలో 2.73 ఎకరాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఉత్తరాంధ్రలో 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఇప్పటికే ప్రాజెక్టు మొదటి,రెండో విడతల్లో చెరో రెండు ప్యాకేజీలకు టెండర్లు పిలిచి నిర్మాణ సంస్థలకు అప్పగించారన్నారు. మరో నాలుగు ప్యాకేజీలకు సంబంధించి భూముల సేకరణ, సర్వే జరిపి ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రాజెక్టు పనులు వచ్చే ఏడాది పూర్తి కానున్నట్టు తెలిపారు.

రసాయన ఎరువులు వాడొద్దు



పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

తుమ్మపాల: వరి పూతదశలో ఉన్నందున ఎటువంటి రసాయన ఎరువులు వాడవద్దని, తగిన నీటిని అందజేయాలని వ్యవసాయ శాఖ అధికారులు జ్యోతి మోహన్,రమేష్ రైతులకు సూచించారు. మండలంలోని సీతానగరంలో ఇండిగ్యాప్ పొలంబడిలో భాగంగా రైతులతో కలిసి వరి పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండిగ్యాప్ పొలంబడి రైతులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ ఇచ్చే ధ్రువీకరణపత్రం ద్వారా మార్కెట్ ధర కన్నా అధిక ధరకు వరిని అమ్ముకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో కూడా ధాన్యాన్ని అధిక ధరకు విక్రయించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పోలమర శెట్టి గోవిందరాజు, సూరిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బిందు, తుంపర్ల సేద్యం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

తుమ్మపాల: ప్రభుత్వ పథకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. రైతులకు సబ్సిడీపై బిందు, తుంపర్ల సేద్యం (డ్రిప్ ఇరిగేషన్) పరికరాల పంపిణీని, బిందు, తుంపర్ల సేద్యం వాహనాన్ని ఆయనతో పాటు ఏపీయూఎఫ్ఐడీసీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిందు సేద్యం పరికరాలను రైతులు ఉపయోగించుకోవాలన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వి.లక్ష్మి , ఏరియా ఉద్యాన శాఖ అధికారి రంజిత, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు పాల్గొన్నారు.